# హక్కులు లేని మనిషి బానిసతో సమానం--

## సెట్కూరు సీఈఓ డా. వేణుగోపాల్--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 10-యువజన సంక్షేమ శాఖ, సెట్కూరు ఆధ్వర్యంలో ఎస్ వీ ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సెమినార్‌లో సెట్కూరు సీఈఓ డా. వేణుగోపాల్ మాట్లాడారు. మనిషి స్వతంత్రంగా, గౌరవంగా జీవించాలంటే హక్కులు అనివార్యమని, హక్కులు లేని వ్యక్తి బానిసతో సమానమని పేర్కొన్నారు. 1948 డిసెంబర్ 10న ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సార్వజనీన ప్రకటనను ఆమోదించిన విషయం గుర్తు చేశారు. అప్పటి నుంచి ప్రతీ ఏడాది మానవ హక్కుల దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారని తెలిపారు. ఈ ఏడాది "మానవ హక్కులు ? మన రోజువారీ అవసరాలు" అనే నినాదంతో కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్మెంట్ అధికారి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ చట్టం 1993లో ఆమోదం పొందిందని, హక్కుల పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యతని తెలిపారు. కళాశాల చైర్మన్ వెంకట రామి రెడ్డి హక్కులపై అవగాహన ఉంటేనే అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యం వస్తుందన్నారు. అనంతరం ప్రసంగ, వ్యాస రచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరి ప్రసాద్ రెడ్డి, విభాగాధిపతి భాస్కర్ రావు, సెట్కూరు పర్యవేక్షకులు శ్యాం బాబు పాల్గొన్నారు.

# విభిన్న ప్రతిభావంతులకు మూడు నెలలకు-ప్రత్యేక గ్రీవెన్స్ సెల్--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , డిసెంబరు 10:విభిన్న ప్రతిభావంతుల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. కలెక్టరేట్‌లో జరిగిన 66వ అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి ప్రారంభించిన ఇంద్రధనస్సు పథకం ద్వారా ప్రయోజనాలు అందుతున్నాయని చెప్పారు. ప్రతిభావంతుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి మూడు నెలలకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తామని తెలిపారు. గ్రామ సచివాలయాల్లో వేగవంతమైన సేవలు, ఉద్యోగుల బదిలీలలో పారదర్శకత, కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు వంటి చర్యలు చేపడతామని చెప్పారు. ఇల్లు లేని కుటుంబాలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. నందికొట్కూరు దేవాదాయ భూమిలోని 450 ప్లాట్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని వెల్లడించారు. చైర్మన్ గడుపూటి నారాయణ స్వామి ఇంద్రధనస్సు పథకంలోని ఉచిత ప్రయాణం, సబ్సిడీ రుణాలు, టిడ్కో గృహాల్లో గ్రౌండ్ ఫ్లోర్ కేటాయింపు, నెలకు రు. 6,000 పెన్షన్ వంటి ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులను సత్కరించారు. నవజీవన్ చెవిటి పిల్లల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

## అన్నా క్యాంటీన్ ని ఆకస్మిక తనిఖీ చేసిన కోట్ల...

విభారె న్యూస్ డోన్ మా ప్రతిని: -డోన్ పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో అందిస్తున్న ఆహారం నాణ్యత,పాత్రల శుభ్రత, భోజనశాలలో పరిశుభ్రత వంటి అంశాలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. పరిశుభ్రత ప్రమాణాలు కచ్చితంగా పాటించకపోతే ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని పేర్కొంటూ,



క్యాంటీన్ నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. క్రమం తప్పకుండా శుభ్రతను పరిశీలిస్తూ, ప్రజలకు అందించే ఆహారం ఎల్లప్పుడూ నాణ్యమైనదిగా ఉండాలని సంబంధిత సిబ్బందికి ఆయన సూచనలు చేశారు. ప్రజలకు సేవ చేసే అన్న క్యాంటీన్‌లలో ప్రమాణాలు తప్పనిసరిగా ఉన్నత స్థాయిలో ఉండాలని ఆయన తెలిపారు.

# రైతు సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు మా పోరాటం ఆగదు

## --: సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 10-రైతుల సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యేంతవరకు సిపిఐ పోరాటం కొనసాగుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి. ఈశ్వరయ్య స్పష్టం చేశారు. నంద్యాల మార్కెట్ యార్డ్ నుంచి ఎంఆర్ఓ కార్యాలయం వరకు సిపిఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ, అనంతరం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ ఇటీవల మొంతా తుఫాను కారణంగా వరి, మొక్కజొన్న, పత్తి, టమోటా, అరటి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నప్పటికీ రైతులకు నష్టపరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగితే, కేంద్రానికి ప్రభుత్వం 4 లక్షల ఎకరాల నష్టం మాత్రమే చూపడం విచిత్రమన్నారు. దళారులు రైతుల పంటలను మధ్యధరలకు కొనుగోలు చేస్తుండగా ప్రభుత్వం పర్యవేక్షించడంలో విఫలమైందని విమర్శించారు. అరటి




ధరలు 25 వేల నుండి 1000?1500 రూపాయలకు పడిపోవడం రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగించిందని పేర్కొన్నారు. డోన్ ప్రాంతంలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామన్న హామీ కేవలం ప్రకటనగానే మిగిలిందని, రైతుల రుణాలు రద్దు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. సిపిఐ వర్గసభ్యులు కె. రామాంజనేయులు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం కార్పొరేట్లకు మద్దతు ఇస్తోందని విమర్శించారు. మొక్కజొన్నకు 3?4 వేల రూపాయలు ఇవ్వాలని చెప్పి ఇప్పుడు దళారులు 1200 రూపాయలకే కొంటున్నారని జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మొక్కజొన్న, వరి, పత్తి పంటలకు గిట్టుబాటు ధర ప్రకటించాలని, లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాబా ఫక్రుద్దిన్, సుబ్బారెడ్డి, సోమన్న, భార్గవ్, భాస్కర్, సుంకయ్య, రమేష్, రఘురామ

# గడివేముల స్టేషన్ ఆకస్మిక తనిఖీ--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 10-జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ బుధవారం నంద్యాల ఉపవిభాగ పరిధిలోని గడివేముల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ పరిసరాలు, లాకప్ గదులను పరిశీలించి పరిశుభ్రత పాటించాలని సూచించారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, సాధారణ డైరీ, విధి పట్టిక, కేసు నమోదు పుస్తకాలు, ఆన్‌లైన్ నమోదు వ్యవస్థ పనితీరు, పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించి ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలని ఆదేశించారు. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాల స్థితిగతులపై ఆరా తీశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, మైనర్ల వాహనాల వినియోగంపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. సైబర్ నేరాల



నివారణపై గ్రామస్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచి ఎలాంటి అల్లర్లు, గొడవలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు కనిపించే విధంగా పోలీస్ విధులు నిర్వహిస్తూ గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. నేర నియంత్రణలో నిఘా కెమెరాల ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులపై సత్వరం స్పందించి ఫిర్యాదిదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, చట్ట పరిధిలో నిర్దిష్ట సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. పాత నేరస్థులు, నేర చరిత్ర గలవారు, అనుమానితులపై నిఘా పెంచి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. స్టేషన్‌లో అత్యవసర సేవల కోసం ఉపయోగించే ట్యాబ్‌లను బీట్ విధుల్లో ఉన్న పోలీసులు తప్పనిసరిగా వినియోగించాలని ఆదేశించారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ,

కర్నూలు :- ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ దిశగా నెట్టేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను రాష్ట్ర ప్రజలే తప్పుపట్టారని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కర్నూల్లో తెలిపారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల అసంతృప్తి రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రైవేటీకరణ వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించాల్సిన పరిస్థితి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. పాణ్యం నియోజకవర్గంలోనే 60 వేల సంతకాలు రావడం ప్రజల ఆగ్రహానికి సూచిక అన్నారు. సేకరించిన సంతకాల పత్రాలను విజయవాడలోని మాజీ సీఎం జగన్ కార్యాలయానికి తరలిస్తున్నామన్నారు. డిసెంబర్ 15న గవర్నర్‌కు నివేదన సమర్పించనున్నామని తెలిపారు. ప్రైవేటీకరణ వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని, ప్రభుత్వం దీనిపై ఏ మాత్రం ఆలోచించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగ సమస్య తీవ్రమయ్యే సమయంలో మెడికల్ రంగంలో కూడా ప్రైవేటీకరణ పెంచి అవకాశాలు తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమా అని ప్రశ్నించారు. ప్రజల అభిప్రాయాలను పట్టించుకోకుండా తీసుకుంటున్న నిర్ణయాలు ప్రభుత్వం ప్రజలనుంచి మరింత దూరమవుతున్న సంకేతాలని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మైనారిటీ విద్యా పురోగతికి ఎల్లప్పుడూ సహకరిస్తాం.. కోట్ల





విభారె న్యూస్ డోన్ మా ప్రతినిధి: -డిసెంబర్ 10 డోన్ మండల పరిధిలోని ఉడుములపాడు గ్రామ సమీపంలో నూర్?ఉల్?ఇస్లాం మద్రసా ఫౌండేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి హాజరయ్యారు. మద్రసా నిర్వహణ, విద్యా సదుపాయాల అభివృద్ధి మరియు విద్యార్థుల శ్రేయస్సు కోసం ఉపయోగించుకునే విధంగా ఆయన లక్ష రూపాయలను విరాళంగా ప్రకటించారు. ప్రాంతంలోని మైనారిటీ విద్యా పురోగతికి తాను ఎల్లప్పుడూ సహకరిస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో చివరగా మద్రసా ఇమామ్ ప్రత్యేక దువా నిర్వహించారు. ప్రాంత ప్రజల అభివృద్ధి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, సమాజంలో శాంతి?సౌభ్రాత్రులు నెలకొనాలని, అలాగే విరాళం అందించిన డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి కి అల్లాహ్ మంచి ఆరోగ్యం, దీర్ఘాయువు, మరింత సేవ చేస్తూ ఉండే శక్తిని ప్రసాదించాలని వారు కోరారు

# రామకృష్ణ డిగ్రీ కళాశాలలో మానవ హక్కుల దినోత్సవం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 10-రామకృష్ణ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు ఎస్పీ ఎన్. యుగేంద్రబాబు హాజరయ్యారు. కళాశాల అధినేత డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మానవులు తమ హక్కులను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమాన్ని అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం. ఇంటియాజ్ అహ్మద్ విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థులు మానవ హక్కుల చరిత్రను వివరించారు. అధ్యాపకురాలు ఎం. రత్నారెడ్డి మానవ హక్కుల ఆవిర్భావాన్ని వివరించారు. డైరెక్టర్ జి. హేమంత్‌రెడ్డి సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నిబంధనలు చదవడం ప్రతి వ్యక్తి హక్కు అని అన్నారు. ఎస్పీ యుగేంద్రబాబు మానవ హక్కుల చరిత్ర, రాజ్యాంగ హక్కుల ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులు బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. హక్కులు?బాధ్యతలు రెండూ సమానంగా ముఖ్యమని చెప్పారు. చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్ పౌరులని, సమాజంపై సానుకూల ప్రభావం చూపేలా ఆలోచించాలని సూచించారు. 75 శాతం హాజరు తప్పనిసరిగా ఉండాలని, కెరీర్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190